నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ వెంకట్ నారాయణ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఏపీహెచ్‌బీ కాలనీ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జయభేరి ఎన్‌క్లేవ్, ఏపీహెచ్‌బీ కాలనీ, ఓల్డ్ గచ్చిబౌలి, లీ మెరిడియన్ హోటల్, యూనివర్సల్ రియల్టర్స్ అపార్ట్‌మెంట్స్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని చెప్పారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

థింక్ ఈజ్ మోడలింగ్

మాదాపూర్: మోడల్స్ ర్యాంప్‌వాక్ ద్వారా సందేశాత్మక సమాచారం ఇస్తున్నారు. మాదాపూర్‌లోని శ్రీ వేంకటేశ్వర కళాశాలలో నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న థింక్ ఈస్ మోడలింగ్ పేరిట వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నారు. బుధవారం ప్రారంభమైన వర్క్‌షాప్ నాలుగు రోజుల పాటు కొనసాగనుంది. సందేశాత్మకంగా వినూత్న పద్ధతిలో మోడలింగ్ చేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. శ్రీ వేంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఆర్కిటెక్చర్, ఆర్‌వి స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ చెన్నై సహకారంతో నిర్వహించనున్నట్లు తెలిపారు. చివరి రోజు అవార్డుల ప్రదానోత్సవం, సర్టిఫికెట్‌ల ప్రదానం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వాణీదేవి తదితరులు పాల్గొననున్నారు.

కాలనీల్లో విద్యుత్ అధికారుల పర్యటన


ఆలిండ్ కాలనీలో పర్యటిస్తున్న గచ్చిబౌలి డీఈ యాదగిరి తదితరులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ ఆలిండ్ కాలనీ, భాగ్యనగర్ కాలనీల్లో ఎలక్ట్రిసిటీ అధికారులు బుధవారం పర్యటించారు. గచ్చిబౌలి డీఈ యాదగిరి, ఏడీఈ శివప్రసాద్ కాలనీల్లో పర్యటించి, సమస్యలు తెలుసుకొని అక్కడిక్కడే పరిష్కరించారు. ఆలిండ్ కాలనీలో ఒరిగిపోయిన విద్యుత్ స్తంభాన్ని మార్చి దాని స్థానంలో కొత్త దానిని ఏర్పాటు చేయడంతో కాలనీవాసులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

వసతుల కల్పనకు కృషి


అధికారులతో కలిసి పర్యటిస్తున్న కార్పొరేటర్

మోతీనగర్: ఆయా కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని కార్పొరేటర్ సబిహా బేగం అన్నారు. అల్లాపూర్ డివిజన్ సఫ్దర్‌నగర్ ఈ బ్లాక్‌లో బుధవారం ఇంజనీరింగ్, జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రాధాన్యత క్రమంలో సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ పనులు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో అబ్దుల్ సలీం, షేక్ రఫీక్, వెంకటేష్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

లింగంపల్లి రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరే రైళ్ల వివరాలు ..

- 4.40 అమరావతి ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి–విజయవాడ
- 6.15 జన్మభూమి ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి– వైజాగ్
- 12.25 దేవగిరి ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి– సీఎస్‌ఎంటీ (ముంబాయి)
- 17.30 నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి – తిరుపతి
- 18.25 కోకనాడ ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి –కాకినాడ (సోమ, బుధ, శుక్ర)

(19.00 మంగళ, గురు, శని)

- 20.30 గౌతమి ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి– కాకినాడ
- 21.00 నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి–నర్సాపూర్
- 22.05 హంసఫర్ ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి–ఇండోర్ (ఆదివారం)

అక్రమ నిర్మాణం సీజ్

రాజేంద్రనగర్: నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న నిర్మాణానికి నోటీసులు ఇచ్చినా పట్టించుకోకపోవడంతో జీహెచ్‌ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు బుధవారం అక్రమ నిర్మాణాన్ని సీజ్ చేశారు. ఉప్పర్‌పల్లి జన చైతన్య కాలనీ విల్లా నంబర్ 36 యజమాని అనుమతి లేకుండా మూడో అంతస్తుతో పాటు పెంట్‌హౌస్ నిర్మిస్తున్నారు. ఈ విషయమై ఫిర్యాదు అందిన వెంటనే స్పందించిన జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు నిర్మాణదారునికి నోటీసులు అందించారు. నోటీసులు అందుకున్న స్పందించకపోవడం.. నిర్మాణాన్ని కొనసాగిస్తుండటంతో రాజేంద్రనగర్ సర్కిల్ ఉప కమిషనర్ డాక్టర్ రవికుమార్, టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీధర్‌ల ఆధ్వర్యంలో బుధవారం మూడో అంతస్తుతో పాటు పెంట్‌హౌస్‌ను సీజ్ చేశారు.

యోగా మాస్టర్

హెచ్‌సీయూ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా కొనసాగుతూనే ఉచిత యోగా శిక్షణ


సుదర్శన్‌నగర్ కాలనీ పార్కులో యోగా శిక్షణ ఇస్తున్న డా.శ్రీనివాస్



రాయదుర్గం: సమాజంలో అందరికీ సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం అంటూ హెచ్‌సీయూ అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ బంగారు శ్రీనివాస్ పలువురికి ఉచిత శిక్షణ ఇస్తూ మరోవైపు ఆన్‌లైన్ శిక్షణకు శ్రీకారం చుట్టారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా డా.శ్రీనివాస్ విధులను నిర్వహిస్తున్నారు. తాను నివాసముండే ప్రాంతంలో ఆసక్తి చూపే వారికి ఉచితంగా యోగా శిక్షణ ఇవ్వడం ప్రారంభించారు. విధులకు ఇబ్బందికలగకుండా అందరికీ అనువైన సమయంలో యోగా నేర్పుతున్నారు. కాగా శ్రీనివాస్ పతంజలి యోగా శిక్షణ కూడా పొందారు. అనంతరం కేంద్ర ఆయూష్ శాఖ థియరీ, ప్రాక్టికల్స్ పరీక్షల కోసం రెండు నెలలు శిక్షణ తీసుకున్నారు. ఈ పరీక్షలలో దేశవ్యాప్తంగా 250 మంది పాల్గొనగా 16 మంది ఉత్తీర్ణులవగా అందులో శ్రీనివాస్ ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆయుష్‌శాఖ సర్టిఫైడ్ యోగా టీచర్‌గా బంగారు శ్రీనివాస్ గుర్తింపు సాధించారు. అనంతరం శిక్షణ ఇవ్వడం ప్రారంభించారు.

పలుచోట్ల ఉచిత శిక్షణ

- కేంద్ర ప్రభుత్వం సర్టిఫికెట్ వచ్చాక యోగా టీచర్‌గా శిక్షణకు శ్రీకారం చుట్టారు.
- హెచ్‌సీయూ క్యాంపస్‌లోని ఉద్యోగులు, అధికారులు, సిబ్బందికే కాకుండా బొటానికల్ గార్డెన్‌లో వాకర్స్‌కు, మహిళలకు శిక్షణ ఇస్తున్నారు.
- సుదర్శన్‌నగర్ పార్కులో కూడా ఉదయాన్నే వాకింగ్ వచ్చే వారికి శిక్షణ ఇస్తున్నారు.

ఉచిత ఆన్‌లైన్ శిక్షణకు శ్రీకారం..

- యోగాను శేరిలింగంపల్లివాసులకే కాకుండా ఆన్‌లైన్ ద్వారా సోమవారం నుంచి శుక్రవారం వరకు రోజూ ఉదయం 6 నుంచి 7 గంటల వరకు ఇవ్వనున్నారు
- ఆన్‌లైన్ యోగా శిక్షణకు 26 మంది తమ పేర్లను నమోదు చేసుకోగా అందులో ఒకరు జమ్మూకశ్మీర్, మరో వ్యక్తి ఉత్తరప్రదేశ్‌నుంచి ఉండగా మిగతా వారు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఉన్నారు
- 25 ఏళ్ల లోపు వారు 50 శాతం మంది ఉండగా 40 నుంచి 60 ఏళ్ల లోపు 50 శాతం మంది ఉన్నారు.

> **సమాజంలో ఆరోగ్యవంతుల సంఖ్య పెంచడమే లక్ష్యం**
>
> 
>
> యోగా ద్వారా అందరూ సంపూర్ణ ఆరోగ్యవంతులు కావడం ఖాయం.ప్రస్తుతం డాక్టర్లు కూడా యోగా, నడక, వ్యాయామం చేయాలని అందరికీ సూచించడం తెలిసిందే.ఆరోగ్య వంతులు కూడా యోగాపై దృష్టి సారిస్తూ ఎక్కడ చేయాలనేది కాకుండా తమ బెడ్‌రూమ్‌లోనే ఉండే స్థలంలోనే యోగా చేసుకోవచ్చు. ఇప్పటికైనా అందరూ ఆసక్తి కనబరిస్తే సంపూర్ణ ఆరోగ్యవంతులు కావడం ఖాయం. సాధారణంగా హెచ్‌సీయూ, బొటానికల్‌గార్డెన్, సుదర్శన్‌నగర్‌పార్కులలోనే కాకుండా ఆన్‌లైన్ ద్వారా యోగా శిక్షణను నిరంతరం కొనసాగిస్తూనే ఉంటా. కేంద్ర ప్రభుత్వంలోని ఆయుష్ శాఖ ద్వారా సర్టిఫైడ్ యోగా టీచర్‌గా గుర్తింపు రావడం ఎంతో సంతోషంగా ఉంది.నాకు వచ్చిన విద్య, ఆరోగ్య సాధనలో నలుగురికి నేర్పి వారి ఆరోగ్యాన్ని మెరుగుపర్చడంలో నేనూ భాగస్వామి కావడం చాలా సంతోషానిస్తుంది. అటు వృత్తిని, ఇటు ప్రవృత్తిని పవిత్రంగా భావిస్తూ నా విధులను సక్రమంగా నిర్వహిస్తూ రెండింటికీ పూర్తి న్యాయం చేకూర్చమే నా లక్ష్యం.
>
> – డాక్టర్ బంగారుశ్రీనివాస్–హెచ్‌సీయూ అసిస్టెంట్ రిజిస్ట్రార్– యోగా టీచర్

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ


మియాపూర్ క్యాంపు కార్యాలయంలో చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్ : శేరిలింగంపల్లి మండల పరిధిలో కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ లబ్ధిదారులకు బుధవారం రూ.20లక్షలు చెక్కులను ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ మియాపూర్ క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శేరిలింగంపల్లి మండల పరిధిలోని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, మాదాపూర్, మియాపూర్, హఫీజ్‌పేట, చందానగర్, భారతీ నగర్ డివిజన్‌లకు చెందిన 20 మందికి చెక్కులు అందజేశామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెంచొద్దని వినతి

మోతీనగర్: ప్రస్తుతం భూమి, ఇళ్ల రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచితే కొనుగోలుదారులు ఆసక్తి చూపరని, ఛార్జీలు పెంచొద్దని వెస్ట్ జోన్ బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు బుధవారం నగరంలోని ప్రధాన కార్యాలయంలో కమిషనర్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ ఐఏఎస్ అధికారి రాజీవ్‌గాంధీ మనుమంత్‌ని కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. రియల్ ఎస్టేట్ వ్యవస్థ మళ్లీ పుంజుకోవాలి అంటే రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెంచవద్దన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు విజయసాయి, సెక్రటరీ శ్రీకాంత్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ లయన్ కిరణ్, తెలంగాణ బిల్డర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాజిరెడ్డి, బిల్డర్స్ పాల్గొన్నారు.

తల్లీ, ఇద్దరు పిల్లలు అదృశ్యం

మియాపూర్ : తల్లీ, ఇద్దరు పిల్లలు ఇంటి నుండి వెళ్లి తిరిగిరాని సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ ఓల్డ్ హఫీజ్‌పేటలోని సాయినగర్ కాలనీలో గోపి, దివ్య(29) దంపతులకు కుమారుడు శ్రీనివాస్(10), కూతురు నందిని(8) ఉన్నారు. గోపి స్థానికంగా ఓ హోటల్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 14వ తేదీన ఉదయం 5.30 గంటల సమయానికి గోపి విధులకు వెళ్లి రాత్రి 11.30 గంటలకు ఇంటికి రాగా తాళం వేసి ఉంది. చుట్టుపక్కల, బంధువులు ఇళ్లల్లో విచారించినా ఫలితం లేకపోవడంతో ఆందోళన చెందిన గోపి మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కాగా అంతకుముందు రోజు భార్యాభర్తల మధ్య గొడవ జరిగిందని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. ఈ మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


అదృశ్యమైన దివ్య, కుమారుడు శ్రీనివాస్, కూతురు నందిని

నీటి సరఫరాలో అన్యాయాన్ని సహించం


జలమండలి కార్యాలయం వద్ద నిరసన తెలిపిన బీఆర్‌ఎస్ నాయకులు

- కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలకు సమంగా సరఫరా చేయాలి
- బీఆర్‌ఎస్ నాయకుల డిమాండ్

మణికొండ: గేటెడ్ కమ్యూనిటీలకు ఎక్కువగా, కాలనీలకు తక్కువగా కాకుండా సమంగా నీటిని సరఫరా చేయాలని, నిబంధనల్లో లేని వాల్వ్ చార్జీలను వేస్తున్నారని, 240 గజాల లోపు గృహాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ లేకుండా నీటి కనెక్షన్లు ఇవ్వాలని బీఆర్‌ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మణికొండలోని జలమండలి డివిజన్–18 కార్యాలయం వద్ద పార్టీ మున్సిపల్ శాఖ అధ్యక్షుడు డి.సీతారాం ఆధ్వర్యంలో ప్లకార్డులు చేతబట్టి నిరసన తెలిపారు. అనంతరం జీఎం శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ... మున్సిపాలిటీ పరిధిలోని గేటెడ్ కమ్యూనిటీల వద్ద సిబ్బంది డబ్బులు తీసుకుంటూ ఎంత పడితే అంత సమయం నీటిని సరఫరా చేస్తున్నారని ఆరోపించారు. అదే కాలనీలకు వచ్చే సరికి గతంలో రోజు విడిచి రోజు గంటన్నర సమయం మాత్రమే సరఫరా చేయగా ప్రస్తుతం దాన్ని గంటకు తగ్గించారన్నారు. దాంతో ప్రజలు నీరు సరిపోక వేలాది రూపాయలు వ్యయం చేస్తూ ట్యాంకర్లను కొనుగోలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అలకాపూర్ టౌన్‌షిప్ స్పోర్ట్స్ పార్క్‌లో ప్రారంభించిన రిజర్వాయర్‌ను వినియోగంలోకి తీసుకొస్తే ప్రజలకు మరింత సమయం నీటిని సరఫరా చేయవచ్చన్నారు. సామాన్య ప్రజల వద్ద నీటి బిల్లులతో పాటు వాల్వ్ చార్జీల పేరుతో వేలాది రూపాయలు దండుకుంటున్నారన్నారు. ఇకనైనా జలమండలి అధికారులు తమ పనితీరు మార్చుకుని ప్రజలకు సరిపడే స్థాయిలో నీటిని సరఫరా చేయాలని, అదనపు చార్జీలను తొలగించాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి జి.నరేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.ధన్‌రాజ్, ప్రచార కార్యదర్శి ఉపేంద్రనాథ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎ.లక్ష్మణ్‌రావు, మహిళా అధ్యక్షురాలు రూపారెడ్డి, నాయకులు రాజేంద్రప్రసాద్, శ్రీకాంత్, శ్రీధర్, ఆరిఫ్ మహ్మద్, భానుచందర్, సుమ నళిని, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

20న ఉచిత వైద్యశిబిరం

కూకట్‌పల్లి: ఆదిత్య నగర్‌లోని గణేష్ ప్యాకర్స్ అండ్ మూవర్స్ టెంట్‌హౌస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ప్రసాద్ హాస్పిటల్ వైద్యుల పర్యవేక్షణలో 20న ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆదిత్యనగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో వైద్య శిబిరం ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు. జనరల్ ఫిజీషియన్, కార్డియాలజిస్ట్, ఆర్థోపెడిస్ట్, ఆప్తమాలజిస్ట్, డెంటల్, పిడియాట్రిషియన్, గైనకాలజిస్ట్‌లు అందుబాటులో ఉంటారని తెలిపారు. బీపీ, షుగర్, సీబీపీ, ఈసీజీ, ఎక్స్‌రే ఐ స్క్రీనింగ్, డెంటల్ చెకప్ వంటి వైద్య చికిత్సలు ఉంటాయని తెలిపారు.

20 నుంచి నిజాంపేట్‌లో బోనాలు


సమావేశంలో పాల్గొన్న పెద్దలు

నిజాంపేట్ : తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతిబింబం బోనాల పండుగ. ఆషాఢ మాసం మొదట్లో ప్రారంభమై నెలాఖరు వరకు బోనాలు ఘనంగా నిర్వహిస్తారు. బుధవారం నిజాంపేట్ గ్రామం పరిధిలో పెద్దల సమక్షంలో బోనాల పండుగపై సమీక్ష నిర్వహించారు. ఈ నెల 20 నుంచి బోనాల పండుగ చేయడానికి నిర్ణయించారు. కార్యక్రమంలో కొలన్ నరసింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సాయి యాదవ్, రాజమోహన్‌రెడ్డి, తలారి వీరేష్, నాగేష్, మేకల బాలకృష్ణ, క్రాంతి, యాదయ్య, జీతయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

సైబర్‌సిటీ ఎస్‌ఈ చంద్రశేఖర్


కాలనీవాసులతో సమావేశమైన సైబర్‌సిటీ ఎస్‌ఈ చంద్రశేఖర్ తదితరులు

గచ్చిబౌలి: విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సైబర్‌సిటీ ఎస్‌ఈ చంద్రశేఖర్ పేర్కొన్నారు. బుధవారం కాలనీ విజిట్‌లో భాగంగా కొండాపూర్‌లోని గోల్డెన్ తులీప్‌లో పర్యటించారు. విద్యుత్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో చెట్లు అధికంగా ఉండటంతో కేబుల్స్ పాడయ్యాయని ఎస్‌ఈ దృష్టికి తీసుకొచ్చారు. కొత్తలైన్లు వేసేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్‌ఈ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కొండాపూర్ డీఈ శ్యామ్‌కుమార్, ఏడీఈ కమలాకర్ రెడ్డి, ఏఈ రంగారెడ్డి పాల్గొన్నారు.

బోనాల జాతరకు ఆహ్వానం

రాజేంద్రనగర్: ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలకు హాజరు కావాలని కోరుతూ శివరాంపల్లి వాసులు బుధవారం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శివరాంపల్లివాసులు మాట్లాడుతూ... ఏటా ఆషాఢ మాసంలో శివరాంపల్లిలో బోనాల ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఈ ఏడాది కూడా పెద్ద ఎత్తున ఉత్సవాలను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు.

పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ బస్సులు

మియాపూర్ : ఆర్టీసీ మియాపూర్–1 డిపో పరిధిలో ప్రతి శుక్ర, శని, ఆదివారాల్లో 3 రోజుల పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పుణ్యక్షేత్రాలను దర్శించుకునేందుకు సూపర్ లగ్జరీ బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ మోహన్‌రావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడ కనకదుర్గమ్మ దేవాలయం, ద్వారక తిరుమల, అన్నవరం, సింహాచలం, వైజాగ్, అరకు ప్రాంతాలకు ప్రతి శుక్ర, శని, ఆదివారాల్లో ప్రత్యేక టూర్ ప్యాకేజీ ఉంటుందని తెలిపారు. ఈ బస్సులు శుక్రవారం రాత్రి 8 గంటలకు మియాపూర్ నుండి బయల్దేరి సోమవారం రాత్రి 10 గంటల వరకు మియాపూర్ డిపోకు చేరుకుంటుందని తెలిపారు. 30 మందికంటే ఎక్కువ మంది భక్తులు ఉంటే ఏరోజైనా బస్సులు నడుపుతామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

వన్ –డే టూర్..

ఆర్టీసీ మియాపూర్ డిపో–1 పరిధిలో ఒక రోజు యాత్ర నిమిత్తం సూపర్ లగ్జరీ బస్ నడుపుతున్నట్లు డిపో మేనేజర్ మోహన్‌రావు తెలిపారు. గణేషగడ్డ వినాయక ఆలయం, లక్ష్మీనరసింహస్వామి దేవాలయం, రేచింతల్ వరసిద్ధి వినాయక ఆలయం, ఝరాసంఘం సంగమేశ్వరస్వామి, చాముండేశ్వరి ఆలయం, ఏడుపాయల వనదుర్గమాత దేవాలయాల దర్శనానికి ప్రతి ఆదివారం సూపర్ లగ్జరీ బస్సులు నడుపుతున్నామని తెలిపారు. ఈ బస్సులు మియాపూర్ ఎక్స్ రోడ్డు నుండి ఉదయం 5 గంటలకు బయల్దేరుతుందని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 8500309052,7659029882లలో సంప్రదించాలని కోరారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి
- మహిళా గ్రూపులకు రూ.11 కోట్ల 8 లక్షలు చెక్కుల పంపిణీ


చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య

పటాన్‌చెరు: మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు, మహిళా సమైక్య సంఘాల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని.. ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కోరారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఇందిరా మహిళాశక్తి విజయోత్సవాల కార్యక్రమానికి కలెక్టర్ ప్రావీణ్య, పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నియోజకవర్గ పరిధిలోని 618 మహిళా సమైఖ్యలకు రూ. 58 కోట్ల 24 లక్షల బ్యాంకు లింకేజీ రుణాలు, 4,255 మహిళ సమైఖ్య గ్రూపులకు మంజూరైన 11 కోట్ల ఎనిమిది లక్షల రూపాయల వడ్డీ లేని రుణాల చెక్కులను ఆయా గ్రూపులకు అందజేశారు. ఈ సందర్భంగా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పటాన్‌చెరు నియోజకవర్గంలో 7 వేలకు పైగా మహిళా సమైక్య గ్రూపులు పనిచేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి దేవుజ, డీఆర్డీఏ జిల్లా అధికారి వెంకటేశ్వర్లు, రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప నగేష్, పటాన్‌చెరు డీఎస్పీ ప్రభాకర్, ఎంపీడీఓలు, తహసీల్దారులు, మున్సిపల్ కమిషనర్లు, జీహెచ్‌ఎంసి డిప్యూటీ కమిషనర్, ఐకెపి అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, మహిళా సమైక్య సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



నేడు పోచమ్మ బోనాలు

ఏర్పాట్లు చేసిన ఆలయ ప్రతినిధులు

కూకట్‌పల్లి: పోచమ్మ తల్లి బోనాలను గురువారం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ పర్యవేక్షకుడు మాధవరం రామచంద్రారావు తెలిపారు. 400 సంవత్సరాల క్రితం పంట పొలాల్లో స్వయంభువుగా వెలసినట్టు పెద్దలు తెలిపారు. 2023 సంవత్సరంలో ఆలయ పున ప్రతిష్ఠ చేసి ఉత్సవాలను నిర్వహించారు. కూకట్‌పల్లిలోని సప్త మాతృక సైత పోచమ్మ దేవాలయంలో ఏడుగురు అమ్మవార్లు ఉన్నారు. పోచమ్మ, ముత్యాలమ్మ, ఎల్లమ్మ, పెద్దమ్మ, దుర్గమ్మ, మైసమ్మ, ఈదులమ్మ తల్లి. ఈ చిత్తారమ్మ దేవాలయం కంటే ముందే గురువారం రోజు ఈ ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఇక్కడ వందల సంఖ్యలో మహిళలు బోనాలను సమర్పించి తమ భక్తిని చాటుకుంటారు. నల్ల చెరువు సమీపంలో ఉన్న దేవాలయంలో ప్రధాన అర్చకులుగా బద్రి ప్రసాద్ శర్మ ఉన్నారు.


దేవినగర్‌లోని పోచమ్మ తల్లి ఆలయం

భక్తులకు మెరుగైన సేవలందించాలి


సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్‌లు, అధికారులు

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- చిత్తారమ్మ బోనాల ఏర్పాట్లపై సమావేశం

ఆల్విన్‌కాలనీ: బోనాల సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలుగకుండా మెరుగైన సేవలందించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బోనాల జాతరను పురస్కరించుకుని అన్ని శాఖల అధికారులతో చిత్తారమ్మ అమ్మవారి ఆషాఢ బోనాల ఏర్పాట్లపై ఆలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివారం బోనాల జాతర సందర్భంగా అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. వేలాదిగా భక్తులు తరలి రానుండటంతో ఆలయ ప్రాంగణంలో తగిన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, వివేకానంద నగర్ కార్పొరేటర్ రోజాదేవి రంగారావు, రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ, పోలీస్, వాటర్‌వర్క్స్, ఎలక్ట్రికల్ డిపార్టుమెంట్, ఎండోమెంట్ అధికారులు, మాజీ చైర్మన్లు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా..

- ప్రతి బుధవారం ఒక్కో బస్తీలో.. విద్యుత్ అధికారుల బస్తీబాట
- సమస్యల ఏకరువు.. సత్వర పరిష్కారం
- హర్షం వ్యక్తం చేస్తున్న బస్తీవాసులు


బంజారాహిల్స్ రోడ్ నం–11 ఉదయ్‌నగర్‌లో పర్యటిస్తున్న విద్యుత్ అధికారులు

బంజారాహిల్స్: విద్యుత్ అధికారుల బస్తీబాట పట్టారు. బస్తీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారమే లక్ష్యంగా ప్రతి బుధవారం బస్తీల్లో పర్యటిస్తున్నారు. కిందిస్థాయి ఉద్యోగి నుంచి అందరూ బృందంగా ఏర్పడి ఒక్కో వారం తమ పరిధిలోని ఒక్కో బస్తీలో స్థానికులతో మాట్లాడుతూ సమస్యలను తెలుసుకుంటున్నారు. ముఖ్యంగా తుప్పుపట్టి, ఒరిగిపోయి ప్రమాదకరంగా ఉన్న స్తంభాలను గుర్తిస్తూ వాటిని తొలగించి కొత్తవి వేసేలా ప్రణాళికలను రూపొందిస్తున్నారు.

- కరెంటు వైర్లు వేలాడుతూ తెగిపోవడానికి సిద్ధంగా ప్రమాదకరంగా ఉంటే వాటిని తొలగించి ఆ స్థానంలో కేబుల్ వైర్లు ఏర్పాటు చేయనున్నారు
- బంజారాహిల్స్ ఏడీఈ పరిధి కిందికి వచ్చే ఫిలింనగర్, బంజారాహిల్స్, మాదాపూర్, జూబ్లీహిల్స్, అమీర్‌పేట సెక్షన్ల పరిధిలో ప్రతి బుధవారం ఒక్కో బస్తీలో ఈ అధికారుల బృందం పర్యటించనుంది.
- టీజీఎస్‌పీడీసీఎల్ ఎస్‌ఈ కరుణాకర్‌బాబు, డీఈ హనుమంతరెడ్డి, ఏడీఈ జీ రమేష్, ఏఈ వై.రమేష్‌కుమార్‌తో పాటు ఆయా సెక్షన్ల పరిధిలోని లైన్‌మెన్లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, ఫోర్‌మెన్లు ఈ బృందంలో ఉంటున్నారు.
- బిల్లుల్లో లోపాలు ఉంటే వాటిని అక్కడికక్కడే సరిచేస్తూ అవసరమైతే సెక్షన్ కార్యాలయానికి రావాలని సూచిస్తున్నారు.
- వినియోగదారుల కరెంటు సమస్యలు, బిల్లుల హెచ్చుతగ్గులు, ఇతర లోపాలు సరిచేసుకోవడానికి బస్తీ బాట దోహదపడుతోంది.